## ప్రభుత్వ పథకాల అమలులో
# చిత్తూరు జిల్లాను అగ్రగామిగా నిలపండీ






**జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశం లో మంత్రి రాం ప్రసాద్ రెడ్డి**

(చిత్తూరు, మే 06, మనం న్యూస్):జిల్లా ఇంచార్జ్ మంత్రి మరియు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూప్రభుత్వ పథకాల అమలులో చిత్తూరు జిల్లాను అగ్రగామిగా నిలపండి భూగర్భ జలాల పెంపునకు ఉద్యమ స్థాయిలో చర్యలు చేపట్టండి రాష్ట్ర ముఖ్యమంత్రి చిత్తూరు జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో జిల్లా అభివృద్ధి, సంక్షేమం పై ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టర్ ల కాన్ఫరెన్స్ లో జిల్లాలోని సమస్యల పై ముఖ్యమంత్రి స్పందించి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. చిత్తూరు జిల్లాను హార్టికల్చర్ హబ్ గా తయారు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారు. మామిడి రైతుల సమస్యలకు పరిష్కారం చూపడానికి చర్యలు చేపడుతున్నారు. పి జి ఆర్ ఎస్ లో అందే రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయి నుండి జిల్లా స్థాయి అధికారులు కృషి చేయాల్సి ఉంది. మండలాలలో వి ఆర్ ఏ లు, సర్వేయర్లు చిత్తశుద్ధి తో పని చేయాలి, మ్యుటేషన్, వెబ్ ల్యాండింగ్ వంటి సమస్యల పరిష్కారం చూపాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించడం జరిగింది. చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ పేద పిల్లలకు మానసిక వికాసం, పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, నరేగా, ఎం పి ల్యాడ్స్ నిధులతో అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక వసతుల పై దృష్టి పెట్టాలి.

జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ సమర్ధవంతంగా పని చేయాలి. నేషనల్ హెల్త్ మిషన్ కింద వైద్య ఆరోగ్య శాఖకు మంజూరైన నిధులతో సకాలంలో పనులు ప్రారంభించి పూర్తి చేయండి

జిల్లా లో ఉన్న అన్ని ఆసుపత్రుల భవన నిర్మాణ పరిస్థితులు, సిబ్బంది వివరాలు కేటాయించిన నిధులు వాటి వినియోగం సంబంధించిన సమగ్ర సమాచారం అందించాలని డి ఎం %ఉ% హెచ్ ఓ కు ఆదేశం పరిశ్రమలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించే పథకాల ప్రోత్సాహకాలతో అర్హులైన వారికి ఋణాల మంజూరుకు చర్యలు చేపట్టాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మున్సిపాలిటీ లలో మరియు పంచాయతీలలో కేటాయించిన నిధులను అధిక భాగం తాగునీటి సమస్య పరిష్కారానికి కేటాయించేలా చర్యలు చేపడుతున్నాం. జెడ్పి సిఈఓ, ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు రానున్న నెల రోజుల్లో త్రాగు నీరు, రోడ్ల నిర్మాణానికి సంబంధించి పనులు పూర్తి చేయాలి.

భూగర్భ జలాల నీటి మట్టంకు సంబంధించి జిల్లాలోని 31 మండలాలలో చివరిస్థానం లో గుడిపల్లి మండలం ఉందని, కుప్పం నియోజకవర్గం లో కూడా నీటి మట్టం తక్కువ గా ఉన్నదని, నీటి మట్టం పెంపునకు ఎన్ ఆర్ ఈ జి ఎస్ కింద పనులు చేపట్టడం జరుగుతున్నదన్నారు.

జిల్లాలో నరేగా కింద గోకులం షెడ్ లు, సి సి రోడ్ లు, ఇతర సంబంధిత పనుల నిమిత్తం రూ.88 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, ఇందులో ఎస్ సి ఎస్ టీ హ్యాబిటేషన్ లకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని, పెండింగ్ లో ఉన్న నిధులు మంజూరు చేయించాలని మరియు రెండు నెలలుగా వేజ్ కాంపొనెంట్ కూడా పెండింగ్ లో ఉందని, నిధుల విడుదలకు కృషి చేయాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులా దృష్టికి తీసుకు వచ్చారు.

మెటీరీయల్ కొంపొనెంట్స్ జిల్లాకు రూ.140 కోట్లు మంజూరు కాగా ఇందులో రూ.114 కోట్లతో బి.టి రోడ్లు, గోకులం షెడ్ లు తదితర పనులు పూర్తి చేశాం. జిల్లాకు మరిన్ని గోకులం షెడ్ ల నిర్మాణాలు అవసరం ఉంది.సాంఘీక సంక్షేమ శాఖ వసతి గృహాల మైనర్ మేజర్ రిపేర్ ల లో భాగంగా 46 హాస్టల్ లకు బడ్జెట్ కేటాయించడం జరిగిందని, ఈ నిధులను విడుదల చేసినట్లయితే రెండు నెలల్లో ఈ పనులను పూర్తి చేసి ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి అవకాశాలు కలవన్నారు. దాదాపు 70 వేల హెక్టార్లలో మామిడి పంట ఉంది. ఒక హెక్టారుకు 3 నుండి 3.5 టన్నుల పంట దిగుబడి వస్తుంది. దీని ప్రకారం 5.5 లక్షల టన్నుల మామిడి దిగుబడి ఉంది. మామిడి గిట్టుబాటు ధర ప్రస్తుతం ఒక టన్నుకు రూ.25 వేల వరకు ఉన్నది. మామిడి రైతులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నుండి ప్రోత్సాహకాలు అందేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. జిల్లాలో మామిడి దిగుబడి అధికంగా ఉన్నందున పల్ప్ ను టిటిడి ద్వారా భక్తులకు అందజేసేలా అందరి ప్రజా ప్రతినిధుల సహకారంతో టిటిడి వారికి లేఖ పంపి వారు సూచించే నాణ్యతా ప్రమాణాలు,ధరలు సంబంధిత అంశాల పై చర్చించేందుకు ఏర్పాటు చేసే కమిటీలో ప్రజా ప్రతినిధులు మామిడి రైతులను కూడా భాగస్వామ్యం చేసేందుకు టిటిడి ద్వారా కమిటీ నియామకానికి చొరవ చూపాలని కోరారు. జిల్లాలో ఈ నెల 4 వ తేదిన కురిసిన వర్షానికి జరిగిన పంట నష్టం నకు సంబంధించిన వివరాలను సంబంధిత శాఖల ద్వారా సిద్ధం చేయడం జరిగింది. జిల్లాలో 256 అంగన్వాడీ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ కనెక్షన్, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని, విద్యుత్ కనెక్షన్ లకు సంబంధించి పనులు పూర్తి కావలసి ఉందని, నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేస్తాం. రహదారులలో గుంతలు పూడ్చడం, రహదారి మరమ్మత్తుల పనులకు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు బిటి రోడ్లు, అప్రోచ్ రోడ్ లు నిర్మాణానికి రూ.61 కోట్లతో పనులు చేపట్టి బిల్లులు అప్ లోడ్ చేశామని, ఇంకా రూ.27 కోట్లతో పనులు చేపడుతున్నాం. ఇందులో చిత్తూరు %-% వేలూరు, యాదమరి %-% గుడియాత్తం రోడ్డు నిర్మాణం చేపట్టాం. ఈ ఆర్థిక సంవత్సరం రోడ్ల ల నిర్మాణానికి రూ.159 కోట్లతో మంజూరు చేపట్టడం జరిగింది. ఇందులో అధిక శాతం ఎస్ సి ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతాలలో రోడ్డు నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నాం. రూ.19.47 కోట్ల నాబార్డ్ నిధులతో నియోజకవర్గాల వారీగా రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగింది. ఇందులో దాదాపు రూ.9 కోట్లు కుప్పం నియోజకవర్గానికి కేటాయించాం. త్వరలో టెండర్ లు పిలవడం జరుగుతుంది. చిత్తూరు జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న వైద్య నిపుణుల సంఖ్య పెరగవలసి ఉన్నది. పారా మెడికల్ సిబ్బంది 160 మంది వరకు ఉన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫరల్స్ తగ్గాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అత్యవసర వైద్య సేవల కొరకు సిఎంసి, స్విమ్స్ ఆసుపత్రులకు వెళ్ళనవసరం లేకుండా సదుపాయాలు ఏర్పాటు చేయాలని అపోలో యాజమాన్యం కు సూచించామన్నారు. జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ప్రభుత్వ వైద్యశాలల అభివృద్ధికి సంబంధించి భవన నిర్మాణాలు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సరఫరాకు అవసరమైన నిధులు త్వరలో అందుతాయని, నిధులు అందిన వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం. పెనుమూరు మండలంలో ఉన్న పి హెచ్ సి ని సి హెచ్ సి గా అప్ గ్రేడ్ చేయడం జరిగింది, భవన నిర్మాణాలు పూర్తి కావలసి ఉంది. భూగర్భ జలాల పెంపునకు సంబంధించి డ్వామా అధికారులు వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్ అధికారులు రైతులతో చర్చించి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు పెనుమూరు మండలంలో జల్ జీవన్ మిషన్ ద్వారా 15 కొత్త తాగు నీటి ట్యాంక్ లు మంజూరు కావడం జరిగింది, 15 వ ఆర్థిక సంఘం లేదా జెడ్ పి నిధుల ద్వారా పనులు పూర్తి చేయాలి. కాణిపాకం ప్రముఖ పుణ్య క్షేత్రం అయినందున ఈ ప్రాంతం లో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నిర్మాణానికి సంబంధించి ఆర్ అండ్ బి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి లో చేపట్టాల్సిన మౌలిక వసతులు, మౌలిక వసతులకు సంబంధించి డి సి హెచ్ ఎస్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి. పి హెచ్ సి, సి హెచ్ సి ల లో పూర్తి కావలసిన భవన నిర్మాణాలకు సంబంధించి డి ఎం అండ్ హెచ్ ఓ నివేదిక తయారు చేసి నిధుల మంజూరు కొరకు రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలి. చిత్తూరు ఎం ఎల్ ఏ గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూగంగాధర నెల్లూరు నుండి చిత్తూరు వైపుగా తిరుపతికి వెళ్ళే భారీ వాహనాలు కట్టమంచి చెరువు వైపుగా వెళితే చిత్తూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు ఉండవని, ఈ రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.జిల్లా కేంద్రంలో జరుగుతున్న జాతీయ రహదారుల పనుల కారణంగా ఈ పనులలో వచ్చే వ్యర్థాలను చెరువులలో వేయడం జరుగుతున్నదని, ఈ చెరువుల పూడికతీత పనులు చేపట్టాలని చెరువుల ఆక్రమణలను తొలగించాలని తెలిపారుజిల్లా పరిషత్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించే నిధులను అన్ని నియోజకవర్గాలకు సమానంగా కేటాయించాలని అత్యవసర సందర్భాలలో ఆ నియోజకవర్గంలోని పరిస్థితులను బట్టి అదనపు నిధులను కేటాయించేలా చర్యలు చేపట్టాలని జెడ్పి సిఈఓ కు సూచించారు.చిత్తూరు జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని, ఈ ఆసుపత్రికి సంబంధించి సమగ్ర నివేదికను అందజేయాలని డి సి హెచ్ ఎస్ కు సూచించారుపూతలపట్టు ఎం ఎల్ ఏ కె.మురళీమోహన్ మాట్లాడుతూయాదమరి, తవణంపల్లి మండలాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులకు సూచించారు. ఆయిల్ పామ్ సాగులో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం పని తీరు బాగుంది. 50 సం.ల ముందు చూపు తో మామిడి రైతుల సమస్యకు ముగింపు పలకాలి. పూతలపట్టు నియోజకవర్గం లో ప్రతి కుటుంబం మామిడి పంట పై ఆధార పడి జీవిస్తున్నారని, మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి భోజనం లో విద్యార్థు లకు పల్ప్ అందజేసేలా కృషి చేయాలిమామిడి పంటకు సంబంధించి పండించే సమయంలో వాతావరణ పరిస్థితుల నుండి అంతర్జాతీయ మార్కెటింగ్ విధానం వరకు అభివృద్ధి చెందేలా పరిశోధనా కేంద్రం చిత్తూరు జిల్లాకు అవసరం. తిరుమల తిరుపతి దేవస్థానానికి వచ్చే భక్తులకు మామిడి పండ్ల జ్యూస్ అందించేలా చర్యలు తీసుకుంటే రైతులకు చాలా మేలు జరుగుతుంది.పూతలపట్టు నియోజకవర్గంలో అత్యధిక ప్రమాదాలు జరిగే సామాజిక ఆరోగ్య కేంద్రం పి. కొత్త కోట వద్ద ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వం కొన్ని కోట్లు ఖర్చు పెడుతున్నప్పటికీ పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారని, ఈ శాఖ పరిధిలో ఉన్న పి హెచ్ సి, సి హెచ్ సి ప్రతి ఆసుపత్రి వారీగా ఇన్ పేషెంట్ ల వివరాలు, ఓ పి వివరాలు సమగ్రం గా చర్చించి ప్రభుత్వం ఖర్చు చేస్తున్న నిధులు సద్వినియోగం అయ్యేలా వైద్య ఆరోగ్య శాఖను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కు సూచించారు ఈ జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశంలో జిల్లా పరిషత్, ఆర్ డబ్ల్యూ ఎస్, పిఆర్, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య శాఖ, హార్టికల్చర్, డ్వామా, పరిశ్రమలు, ఐసిడిఎస్, ఇరిగేషన్ శాఖల పై జిల్లా ఇంచార్జ్ మంత్రి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు.



## జాతర సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

(చిత్తూరు,మే 06,మనం న్యూస్) : నగరంలో జాతర సందర్భంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని నగర పాలక ఆరోగ్యాధికారి డా.లోకేష్ పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలను ఆదేశించారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు..మంగళవారం బజార్ వీధిలో నడివీధి గంగమ్మ ప్రతిష్టించే ప్రాంతాలను పరిశీలించారు. పారిశుద్ధ్య పరంగా చెప్పటాల్సిన ముందస్తు ఏర్పాట్లుపై పరిశీలించారు. నగరంలో బజారు వీధితో పాటు, మిగిలిన ప్రాంతాల్లో నిర్వహించే జాతర ప్రాంతాల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ యాక్షన్ ప్లాన్ పై చర్చించారు. జాతర జరిగే రెండు రోజుల పాటు ఎప్పటికప్పుడు పరిసరాలలో శుభ్రంగా ఉంచడం, వ్యర్ధాలను తొలగించే పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

**సింగిల్ యూస్ ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు..**

నగరంలో చర్చి వీధి, బజార్ వీధి ప్రాంతాల్లో ఎంహెచ్వో డా లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా నిషేధిత సింగల్ యూస్ ప్లాస్టిక్ లను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఆరు దుకాణాలకు రూ.18,000 వేలు అపరాధ రుసుం విధించి వసూళ్లు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు మేస్త్రీలు పాల్గొన్నారు.

## నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక





(శ్రీకాళహస్తి మే 6 మనం న్యూస్:2025-26 సంవత్సరానికి శ్రీకాళహస్తి నూతన ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. వేదాం సమీపంలోని దక్షిణ కాళికామాత ఆలయంలో ప్రెస్ క్లబ్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన ప్రెస్ క్లబ్ కమిటీని సభ్యుల ఆమోదం మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులుగా వేణు గోపాల్(సీవీఆర్ న్యూస్), ప్రధాన కార్యదర్శిగా కార్తీక్ నాయుడు(మహా న్యూస్), గౌరవాధ్యక్షులుగా వై.చంద్రయ్య(జీ న్యూస్), పీఆర్వోగా ఈశ్వర్(రాజ్ న్యూస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఏపీఆర్వోగా చందశేఖర్(ఆంధ్ర ప్రభ), కోశాధికారిగా వినయ్(ప్రైమ్ నైన్), ఉపాధ్యక్షులుగా నత్తం హరిబాబు(ఆంధ్ర నాడు), నాని(ఎన్ టీవీ), వెంకటేష్(ప్రజాశక్తి), కార్యనిర్వాహక కార్యదర్శిగా ధనశేఖర్(99 టీవీ), కార్యదర్శులు బి. రవి(మనం), అలీం(6 టీవీ), జుంలేషా(పబ్లిక్ టుడే), కాకి హరిబాబు(ఆంధ్ర పత్రిక), సంయుక్త కార్యదర్శులుగా బాలచంద్ర(రాజధాని న్యూస్), విజయ్(స్వర్ణసాగరం), బాబు(శుభోదయం), న్యాయ సలహాదారుగా కాకి అంకయ్య(సూర్య బెల్స్), సహాయ కార్యదర్శులుగా గంధం మునిచంద్ర(గరుడ దాత్రి), బాలాజీ(వీ-6), మునిరాజా(ఎక్స్ప్రెస్ 99), సభ్యులుగా శివకుమార్, రామచంద్ర(ఉద్యమ కెరటం), పెంచలయ్య(ఆర్టీ న్యూస్), రఘు(సూర్య), నాగరాజు, విజయ్ భాస్కర్(నేటి మనదేశం), శేఖర్(కార్మికుల న్యూస్), హేమంత్ రెడ్డి(విహారి)లు ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా ఏ. కామేష్ (ప్రజాశక్తి), బొమ్మినేటి హరిబాబు(ఆంధ్ర ప్రభ), బి. చంద్ర శేఖర్(బిగ్ టీవీ)లు ఎన్నుకోబడ్డారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం కోసం నూతన కార్యవర్గం కృషి చేస్తుందని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఈ నెల 18వ తేదీన స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో జరుగుతుంది.

## ప్రెస్ క్లబ్ కార్యదర్శులకు ఎన్నికైన మనం రిపోర్టర్



(శ్రీకాళహస్తి మే 6 మనం న్యూస్: శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం దక్షిణ కాళికామాత ఆలయం వద్ద విలేకరుల సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు ఈ కార్యవర్గంలో మనం దినపత్రిక రిపోర్టర్ బొజ్జ రెడ్డి రవి రెడ్డిని కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు రవిని అభినందనలు తెలిపారు కాగా నూతనంగా ఎన్నిక కాబడిన కార్యవర్గం ఈనెల 18వ తేదీన శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం ఉంటుందని ఎన్నిక కాబడిన నూతన కమిటీ అధ్యక్షులు వేణుగోపాల్ ప్రధాన కార్యదర్శి కార్తీక్ నాయుడు తెలిపారు నూతనంగా ఎన్నిక కాబడిన ప్రెస్ క్లబ్ మిత్రులందరికీ పట్ట పట్టణంలో పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు

## మహిళా కానిస్టేబుల్ మృతి..
## ఎస్పీ మణికంఠ చందోలు. సాయం



చౌడేపల్లి మే 6 మనం న్యూస్: పుంగనూరు నియోజకవర్గ చౌడేపల్లి మండలంలో గోసలకుర పలికి చెందిన లక్ష్మీ (33).కుప్పం నియోజ కవర్గం గుడిపల్లిలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తో ంది. ఇటీవల అనారోగ్యంతో మహిళా కానిస్టేబుల్ లక్ష్మీ మృతి చెందారు ఆమె భర్త హరీష్ బాబుకు ఎస్పీ మణికంఠ చెదోలు ఐడిఆర్ఎఫ్ పండు నుంచి లక్ష రూపాయలు చెక్కును సోమవారం అందజేశారు పోలీస్ శాఖ తరపున బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.

## నలుగురు జూదరులపై కేసు నమోదు



చౌడేపల్లి మే 6 మనం న్యూస్: పేకాట ఆడుతున్న నలుగురు జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు ఆయన కథనం మేరకు చౌడేపల్లి మండలం దుర్గ సముద్రం పంచాయతీ బుటకపల్లి పక్కన ఉన్న పూలకుంట చెరువులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది వెంటనే సిబ్బందితో తరలివెళ్లి పేకాట స్థావరంపై దాడి చేయగా వీరప్పల్లి రవి రాజులూరు మధు పరిహాస్ నాగరాజులు అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ 5100లు 52 పేక ముక్కలను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి
# తండ్రి గోపాలకృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా నివాళులు






**నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష**

శ్రీకాళహస్తి మే , మనం న్యూస్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తన తండ్రి, మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మూడో వర్ధంతిని పురస్కరించుకుని, స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పాల్గొన్నారు. అంతటితో కాకుండా, పంచాయతీ రాజ్ అతిథి గృహంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే, నియోజకవర్గ అభివృద్ధిపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నియోజకవర్గంలోని అనేక మండలాల సీనియర్ నేతలతో సమావేశమై, ఆయా మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

తండ్రి బాటలో అభివృద్ధి పయనం

తన తండ్రి బాటలోనే అభివృద్ధి మార్గాన్ని అనుసరిస్తున్నట్లు తెలిపారు. "గతంలో గోపాలకృష్ణారెడ్డి శ్రీకాళహస్తిని అభివృద్ధి చేశారంటే, ఇప్పుడు అదే దిశగా నేను పని చేస్తున్నాను. మా కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చిరకాల స్నేహబంధం ఉంది. మొదటిసారి సీఎం అయినప్పుడు నా తండ్రి కీలక పాత్ర పోషించారు," అని ఎమ్మెల్యే చెప్పారు.

**బూత్ కమిటీలు – ప్రజలకు చేరువ**

ప్రతి మండలంలో బూత్ కమిటీలు, మండల కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఇది పెద్ద దోహదం చేస్తుందని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను కమిటీల్లో చేర్చడం జరుగుతోందని వివరించారు. నారా లోకేష్ శ్రీకాళహస్తి సందర్శనకు సానుకూలత రేపు (మంగళవారం) మధ్యాహ్నం 3 గంటలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రేణిగుంట విమానాశ్రయానికి చేరుకొని, అనంతరం శ్రీ సిటీ సమావేశాలకు వెళ్లే దారిలో శ్రీకాళహస్తి స్కిట్ కళాశాల సందర్శించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల పునరుద్ధరణపై మంత్రి స్పందించినట్లు సుధీర్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే రూ.5 లక్షలతో మరమ్మతుల టెండర్ పిలవగా, త్వరలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ కళాశాల అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా దినోత్సవం

చౌడేపల్లి మే 6 మనం న్యూస్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ దినోత్సవాన్ని నిర్వహించారు ప్రతి నెలలోని మొదటి మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి పవన్ కుమార్ తెలిపారు ఇందులో భాగంగా ఆశ కార్యకర్తలు తమ రికార్డులను రిజిస్టర్ లను ఆయన పరిశీలించారు అనంతరం డాక్టర్ పవన్ కుమార్ ప్రసంగిస్తూ ఆశా యాప్ లోని ఐదు ఇండికేటర్లు ప్రతిరోజు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు ప్రతి గర్భవతినీ కనీసం నాలుగు సార్లు చెకప్ చేయించాలని తెలిపారు ప్రతి బిడ్డకు ఐదు సంవత్సరాల వరకు ఉచిత టీకాలు వేయించాలని తెలిపారు బయట పిహెచ్సి నుంచి తల్లి ఇంటికి వచ్చిన గర్భవతులకు చంటి బిడ్డలకు సైతం ఆరోగ్య సేవలను అందించాలన్నారు షుగర్ బిపి చెకప్ కు విలేజ్ హెల్త్ క్లినిక్ లేకుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని వారికి సూచించారు ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలకు చీరలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమం నందు సిహెచ్వోలు పార్వతమ్మ ఎం పి హెచ్ ఈ ఓ హరినాథ్ సూపర్వైజర్లు వహుద్దీన్ రెడ్డమ్మ జమున మండలంలోని ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## రావణాసురుడి వాహనంపై శివపార్వతుల ఊరేగింపు



చౌడేపల్లి మే 6 మనం న్యూస్: స్థానిక మృత్యుంజేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శివపార్వతులు రావణుడి పై పూలేగారు ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు శివకుమార్ స్వామి మహేష్ల ఆధ్వర్యంలో వివిధ రకాల పూజలు నిర్వహించారు రాత్రి రావణుడిపై స్వామి అమ్మవార్లను ఊరేగింపుగా తరలించారు సజ్జన కులస్తులు ఈ వాహనానికి ఉభయ దారులుగా వ్యవహరించారు

## నేడు మన్యం వీరుడు అల్లూరికి నివాళి

తిరుపతి మే 6 : స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ జ్యోతి, మన్యం వీరుడు, భరతమాత ముద్దుబిడ్డ, తెలుగు జాతి గర్వించే అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఉదయం 6 నుంచి 8 గంటల మధ్యలో స్థానిక ఉపాధ్యాయ నగర్ లోని రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ కార్యాలయ ప్రాంగణం రుద్రరాజు సంపూర్ణమ్మ గార్డెన్స్ లో అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించనున్నట్లు ఆ సంస్థ అధికార ప్రతినిధి, మానవతా తిరుపతి శాఖ కార్యదర్శి గుండ్రాజు సుకుమార్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అశ్రునివాళి కార్యక్రమానికి నగర ప్రముఖులతోపాటు మానవతామూర్తులు, క్షత్రియ సంఘం నాయకులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

## ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లుగా అయూబ్ ఖాన్, గురవయ్య





తిరుపతి, మే 6: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీ ఎస్పీడీసీఎల్) డైరెక్టర్లుగా పి. అయూబ్ ఖాన్, కె. గురవయ్యలను నియమిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఎస్పీడీసీఎల్ లో చీఫ్ జనరల్ మేనేజర్ హోదాలో ఈ ఏడాది ఏప్రిల్ 30న పదవీ విరమణ పొందిన పి. అయూబ్ ఖాన్ ను డైరెక్టర్/ప్రాజెక్ట్స్ గా నియమించింది. అదే విధంగా ఏపీ ఎస్పీడీసీఎల్ లో చీఫ్ జనరల్ మేనేజర్ హోదాలో గత ఏడాది మే 31న పదవీ విరమణ పొందిన కే. గురవయ్యను డైరెక్టర్/టెక్నికల్ గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వారు బాధ్యతలను స్వీకరించనున్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి..: మల్లీశ్వరి




మనం న్యూస్ సదుం మే 6:చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సదుం మండలం రెడ్డి వారిపల్లి సచివాలయంలో అంగన్వాడీల సమావేశం సూపర్ వైజర్ మల్లీశ్వరి అధ్యక్షతన జరిగింది ఈసందర్భంగా మల్లీశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రామాలలో జరిగే బాల్యవిహాలను ఎదుర్కొని వాటిని అరికట్టాలన్నారు మంగళవారం కిశోరి బాలికల వికాసం కార్యక్రమంలో భాగంగా రెడ్డివారిపల్లెలోని సచివాలయం అంగన్వాడి కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించారు. అంతే కాకుండా బాల కార్మికుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, అనర్థాలు గురించి కార్యక్రమంలో వివరించారు. కిషోర్ బాలికలకు పోషష్టికాహారం పైన పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా గోడపత్రికలను ఆవిష్కరించారు.కార్యక్రమంలో సర్పంచ్ హనుమంత్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్త సుజాత, ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ సెక్రెటరీ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం: బొజ్జల సుధీర్ రెడ్డి




శ్రీకాళహస్తి మే 6, మనం న్యూస్, మండలంలోని రాచగున్నేరి వద్ద ఏపీ ఎం ఎస్ ఎం ఈ భూమిలో షాపింగ్ కాంప్లెక్స్ కు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీఐఐసీ భూములలో 12 కోట్ల 72 లక్షల రూపాయలతో కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. దీని ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం లభిస్తాయని ఆయన తెలిపారు. మహిళ సాధికారకే లక్ష్యంగా ప్రభుత్వం మహిళలని ఆదుకుంటుందని ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తిలోని కలంకారి కళాకారులకు కొయ్యబొమ్మల చేసే కళాకారులకు ఈ షాపింగ్ కాంప్లెక్స్ నందు గదులను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు,గత ప్రభుత్వం ఏపీఐఐసీ భూములను దుర్వినియోగం చేసిందని, వైసిపి కార్యకర్తలకు అప్పజెప్పిందని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదల పక్షాన నిలబడుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ నాగ మల్లయ్య టిడిపి నాయకులు విజయ్ కుమార్, చెంచయ్య నాయుడు,బొల్లినేని జగన్నాథం నాయుడు, సర్పంచ్ నర్రా భార్గవి, నర్రా మోహన్ నాయుడు, తాటిపర్తి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా కట్టమంచి చెరువు పూడికతీత, సుందరకరణ పనులు..

**పనులు పరిశీలించిన జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్**





(చిత్తూరు, మే 06 మనం న్యూస్): చిత్తూరు కట్టమంచి చెరువులో జరుగుతున్న పూడికతీత, సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మేయర్ ఎస్ అమ ుద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, ఇరిగే షన్ అధికారులతో కలిసి కట్టమంచి చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించారు. కట్టమంచి చెరువు గట్టు పటిష్ట పరచడానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులతో మంత్రి సమీక్షించారు. వర్షాకాలం ముందుగానే పూడికతీత పనులు పూర్తి చేయడానికి వీలుగా పనులు వేగంగా చేపట్టాలని మంత్రి ఇరిగేషన్ అధికారులను ఆదేశిం చారు .పూడికతీత పనులు జరుగుతున్న తీరు ఎమ్మెల్యే మంత్రి గారికి వివరించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే గాంధీ రోడ్డు ను పరిశీలించారు. రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టాలని నగర కమి షనర్ మంత్రి ఆదేశించారు. ఈ కార్య క్రమంలో చుడా చైర్ పర్స న్కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసిం హు లు, ఇతర నాయకులు, ఇరిగేషన్, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**మే 11 నుండి 13వ తేదీ వరకు వసంతోత్సవాలు**





తిరుచానూరు, మే 06 (మనం న్యూస్) తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. ఆనంతరం ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మే 11 నుండి 13వ తేదీ వరకు వార్షిక వసంతోత్సవాలు జరుగనున్నాయి. ఇందుకోసం మే 10వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. భక్తులు ఒక్కొక్కరు రూ.150/- చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. ఉత్సవాల్లో భాగంగా మే 12వ తేదీ ఉదయం 9.45 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరగనుంది. వసంతోత్సవాలు జరిగే మూడు రోజులు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఈ ఉత్సవాల కారణంగా మే 11 నుండి 13వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టిటిడి ఆలయ అర్చకులు బాబు స్వామి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ జీ.రమేష్, ఆలయ ఇన్స్పెక్టర్లు చలపతి, సుబ్బరాయుడు, ప్రసాద్, ఏవీఎస్వో జీ.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను ఉంచండి

**ఆరోగ్యశాఖ స్పెషల్స్ చీఫ్ సెక్రటరీ ఎం టి కృష్ణ బాబు విలేజ్ హెల్త్ క్లినిక్లను పరిశీలించిన హెల్త్ చీఫ్ సెక్రటరీ, కమిషనర్ వీర పాండ్యన్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని లు**





రామచంద్రపురం / తిరుపతి రూరల్: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు వైద్య సేవలు అందించి ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని రాష్ట్రం ఆరోగ్య వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు జోనల్ ఇన్చార్జ్ అధికారి ఎ%శీ%.టి కృష్ణబాబు అన్నారు మంగళవారం చంద్రగిరి నియోజకవర్గంలోని తిరుపతి రూరల్ మండలం తన పల్లి, రామచంద్రాపురం మండలంలోని గంగిరెడ్డిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్లను కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తో కలిసి తనిఖీ చేశారు. తనపల్లిలో డ్వాక్రా సంఘాల సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ పై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నారు. ఆస్పత్రికి రోజు వారి వచ్చు పేషెంట్ల వివరాలు వారికి అందిస్తున్నటువంటి సేవలను గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైజాగ్ అధికారులు, సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలను సకాలంలో అందించాలని ఆదేశించారు.పిల్లలు, గర్భవతులకు సరైన సమయంలో వాక్సినేషన్ ఇవ్వాలని తెలిపారు. నాన్ కమ్యూనికేషన్ డిసీజెస్ (ఎన్ డి సి ) సర్వే ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. సర్వే ద్వారా బీపీ షుగర్ వ్యాధులకు సంబంధించిన డేటా పక్రియ సక్రమంగా నిర్వహించాలని ఏఎన్ఎం లకు సూచించారు. సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా బిపి, షుగర్ కు సంబంధించిన మందులు అందుబాటులో ఉండాలని వ్యాధి నిర్ధారణ అయినవారికి సకాలంలో చికిత్స అందించేలా చూడాలని తెలిపారు. బీపీ ,షుగర్ కు సంబంధించిన మందులు ఆసుపత్రి నందు అందుబాటులో ఉంచుకోవాలని మెడికల్ సూపర్డెంట్ ను ఆదేశించారు. గంగిరెడ్డిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్ నందు 104 అంబులెన్స్ వాహనాన్ని పరిశీలించారు. 104 అంబులెన్స్ సేవలు ద్వారా ఎంత మందికి చికిత్స అందించడం జరిగిందని, వారికి అవసరమైన మందులు అందించేలా ఏఎన్ఎంలు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో , ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్, డీఐఓ శాంత కుమారి, డి సి హెచ్ ఎస్ ఆనందమూర్తి మెడికల్ సూపర్ండెంట్ ఉదయశ్రీ, కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జావిద్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎమ్ లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి మెట్టు మార్గంలో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

**టిటిడి ఈవో శ్రీ జె. శ్యామల రావు శ్రీవారి మెట్లు వద్ద సర్వదర్శన టోకెన్ల పంపిణీ కేంద్రాన్ని కేంద్రాన్ని పరిశీలన.**



చంద్రగిరి: తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే భక్తులకు శ్రీవారి మెట్టు మార్గంలో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని టిటిడి ఈవో శ్రీ జె. శ్యామలరావు తెలిపారు. కాలినడకన వెళ్లే మార్గంలో టోకెన్లు పొందేందుకు భక్తులు అసౌకర్యానికి గురౌతున్నట్లు తెలియడంతో టిటిడి అదనపు శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, టిటిడి జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మంలతో కలిసి ఆయన మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శ్రీవారి మెట్టు మార్గంలో టోకెన్లు పొందడానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఆటోవాలాల నుండి సరైన సహకారం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలను ఆటోవాలాలు స్వప్రయోజనాలకు వాడుకుంటున్నట్లు, భక్తుల నుండి విచ్చలవిడిగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు శాశ్వత పరిష్కార మార్గం దిశగా చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు. భక్తులకు టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలను సమీక్షించుకుని, మరింత మెరుగైన పటిష్టమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తిరుపతి నుండి శ్రీవారి మెట్టు మార్గం వరకు బస్సుల సంఖ్య పెంచడాన్ని మరియు టోకన్ల జారీ కౌంటర్లను పెంచే అంశాలను పరిశీలిస్తామన్నారు. భక్తుల నుండి ఫీడ్ బ్యాక్ సేకరించి పటిష్ట సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో టిటిడి సీఈ శ్రీ సత్యనారాయణ, ఎస్ ఈలు శ్రీ వేంకటేశ్వర్లు, మనోహారం, టిటిడి డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏనుగుల గుంపు వలన జరిగిన పంట నష్టాన్ని పరిశీలించిన వినుత కోటా



శ్రీకాళహస్తి మే 6, మనం న్యూస్, రేణిగుంట మండలంలోని మామందూరు గ్రామంలో గత కొన్ని రోజులుగా దాదాపు 150 ఎకరాల మామిడి తోటను, 2 ఎకరాల అరటి తోటపై ప్రతి రోజూ ఏనుగుల గుంపు పడి విచ్చలవిడిగా పంట నష్టాన్ని కల్గిస్తున్నాయని తెలుసుకున్న వెంటనే శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా ఈరోజు మామందూరు గ్రామానికి వెళ్లి అటవీ సమీప ప్రాంతంలో ఏనుగుల గుంపుకు నష్టపోతున్న రైతులతో కలిసి వారి పొలాలను పరిశీలించారు. గత కొన్ని రోజులుగా ఏనుగుల గుంపు వారి పొలాల్లో పడి బీబత్సం సృష్టిస్తున్నాయని, 25-30 సం.ఎ గా పెంచిన 150 ఎకరాల మామిడి తోటలను 70% చెట్లు కొమ్మలు, వెర్లతో సహా విరిచేసి ద్వంసం చేశాయని ఎంతో కష్టపడి నీళ్ళు పోసి కాపాడుకున్న మామిడి తోట ఏనుగుల గుంపు వల్ల ద్వంసం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయామని, కాపుకు వచ్చిన మామిడి పంట మాత్రమే కాకుండా చెట్లు మొత్తం ద్వంసం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అడవికి, మామందూరు గ్రామంలోని రైతుల భూమికి మధ్య 2.5 కి.మీ. పొడవుతో కందకాలు సరిగా లేవని, ఎన్నో ఏళ్ల క్రితం వేసిన ఈ కందకాలు మట్టితో పూడి పోవడంతో ఏనుగుల గుంపు అడవి నుండి సులువుగా పంట పొలాల్లో చొరబడి ఇలా ద్వంసం చేసి తీవ్రమైన కోలుకోలేని నష్టాన్ని కల్గిస్తున్నాయని రైతులు తెలిపారు. పొలాల్లో ఉన్న హ్యాండ్ బోర్ లను విరిచేశాయి, పొలాలకు ఉన్న కంచెలను సైతం ఏనుగులు విరిచేశాయి. దాదాపు 20 రోజులుగా ఏనుగుల గుంపు వల్ల పంట నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకుని వెళ్ళినా ఎలాంటి స్పందన లేదని తెలిపారు. ప్రతి రోజూ ఏనుగుల గుంపు పంటలను నాశనం చేస్తున్నాయని, ఈ ఏనుగుల గుంపు సమస్యలను ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుని వెళ్లి అత్యంత ప్రాముఖ్యతతో పరిష్కరించాలని రైతులు వినుత కోటాను కోరారు. 150 ఎకరాల మామిడి తోట, 2 ఎకరాల అరటి తోట, అటవీ ప్రాంతంలో ఉన్న కందకాలను వినుత కోటా నేరుగా పరిశీలించారు. ఏనుగుల గుంపు వలన కల్గిన ద్వంసాన్ని తక్షణమే ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కి తెలియజేసి సత్వరమే పరిష్కార మార్గాన్ని చూపుతామని, జరిగిన పంట నష్టానికి, ఆస్తి నష్టానికి నష్ట పరిహారం అందేలా చేస్తామని, 2.5 కి.మీ. పొడవు గల కందకాలలో పూడికలు తీసి ఏనుగులను కట్టడి చేసేలా చర్యలు చేపడతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరపున వినుత కోటా రైతులకు ధైర్యం చెప్పి, బరోసా కల్పించినట్లు ఆమె తెలిపారు.

# తిరుపతి రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణ పురోగతిపై ఎంపీ గురుమూర్తి సమీక్ష

**త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచన**





తిరుపతి మే 6 మనం న్యూస్ : తిరుపతి రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి గత ప్రభుత్వ హయాంలో కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.12.23 కోట్లతో పట్టణంలోని ప్రధాన ప్రాంతాలయిన హీరో హోండా షోరూం వద్ద ఎల్.సి-107, రైల్వే సి.ఆర్.ఎస్ వద్ద ఉన్న ఎల్.సి-109 అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి అంగీకారం తెలుపుతూ అప్పట్లోనే ఉత్తర్వులు జారీ అయ్యాయి. విధానపరమైన అనుమతులు పూర్తి కావడంతో ఎట్టకేలకు పనులు మొదలయ్యాయి. ఇదిలా ఉండగా తిరుపతి ఎంపీ డా. మద్దిల గురుమూర్తి సోమవారం పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా చూడాలని రైల్వే ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైల్వే లైన్ కి ఇరువైపులా పట్టణం విస్తరించి ఉండటంతో రైల్వే గేట్ల సమీపంలో వాహన చోదకుల ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతమనీ ఆయన అన్నారు. అండర్ బ్రిడ్జిల నిర్మాణంతో తిరుపతి ట్రాఫిక్ సమస్యలకు త్వరలో పరిష్కారం లబిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఇంజనీరింగ్ విభాగం అదికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# బెంచీలకు రంగులతో గొడవలు సృష్టించకండి



చంద్రగిరి,మే 6,మనం న్యూస్ : పచ్చని పల్లెల్లో బెంచీలకు పసుపు రంగులు అద్ది గొడవలకు సృష్టించొద్దని గ్రామస్తులు అడ్డుకున్నారు. మండల పరిధిలోని నరసింగాపురం గ్రామంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తుడా నిధులతో ప్రతి గ్రామానికి సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశారు. పార్టీలకు అతీతంగా సహజసిద్ధమైన రంగులతో వాటిని తయారు చేసి గ్రామాలకు అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బెంచీలకు పసుపు రంగులు వేయడం మొదలు పెట్టారు. అయితే నరసింగాపురంలో మహా భారత ఉత్సవాలను నిర్వహించేందుకు గ్రామస్తులు కొద్ది రోజులుగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోని సిమెంటు బెంచీలను ఉత్సవాల వద్దకు తీసుకొచ్చారు. దీంతో బెంచీలకు పసుపు రంగులు వేయడానికి కాంట్రాక్టర్ చేరుకోవడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు మించల ప్రవీణ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని పసుపు రంగులు వేయడాన్ని అడ్డుకున్నారు. దీంతో ఎస్ఐ అనిత తన సిబ్బందితో కలసి గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా తమ గ్రామం ప్రశాంతంగా ఉందని, ఎన్నికల సమయం మినహా ఇక్కడ రాజకీయాలకు సంబంధం లేకుండా అందరూ కలసి మెలసి ఉన్నట్లు తెలిపారు. తన సతీమణి ఎంపిటిసిగా ఉంటూ పార్టీలకు అతీతంగా పనిచే యడం జరుగుతోందన్నారు. ఇప్పుడు పసుపు రంగులు అద్దడం ద్వారా గొడవలు కారణం అవుతాయని, త్వరలోనే ఇక్కడ మహా భారత ఉత్సవాలు జరుగుతాయని, ఆధ్యాత్మిక ప్రాంతంలో రాజకీయ రంగులు వేయడం ఏమిటంటూ మండిపడ్డారు. అనంతరం స్టేషన్‌కు వచ్చి మాట్లాడలని వారిని తీసుకెళ్లారు. పోలీసు స్టేషన్‌లో సుమారు రెండు గంటల పాటు కూర్చోబెట్టి, రంగులను వేయకుండా అడ్డుకుంటే పీడీ యాక్టు కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామంటూ బెదిరింపులకు పాల్పడినట్లు వారు తెలిపారు. ఓ వైపు గ్రామస్తులతో మాట్లాడుతుండగా దొంగచాటున పసుపు రంగులు వేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. హైకోర్టు ఆదేశాలను సైతం పోలీసు శాఖ ధిక్కరించి, ఇలా ఒక పార్టీకు చెందిన రంగులను దగ్గరుండి వేయించడంపై ప్రజలు మండిపడుతున్నారు.

## ఎమ్మెల్యే నల్లారి చేతుల మీదుగా పరిశ్రమల శంకుస్థాపన కార్యక్రమం విజయవంతం చేయండి.

**టీడీపీ సీనియర్ నేత పులి సత్యనారాయణ రెడ్డి**



వాల్మీకిపురం మే 6 మనం న్యూస్: వాల్మీకిపురం మండలం గండబోయినపల్లి టోల్ గేట్ సమీపంలోని ఏపీఐఐసీ కి కేటాయించిన భూమిలో పరిశ్రమల ఏర్పాటుకు 8 వ తేదీ గురువారం ఉదయం 9:30 గంటలకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి హాజరై భూమి పూజ మరియు శంకుస్థాపన చేయనున్నారని రెడ్డి సంక్షేమ సంఘం నేత, టీడీపీ సీనియర్ నాయకులు పులి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మార్కెట్ కమిటీ చెర్మన్ కంభం నిరంజన్ రెడ్డి మరియు జిల్లా స్థాయి అధికారులు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ శంకుస్థాపన కు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, నల్లారి అభిమానులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని

## కొదలమడుగు సర్పంచి మాలతీ ప్రతాప్ కుమారుడు జి. వెంకటేష్ ఆకస్మిక మరణం

**కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా మాజీ**

జడ్పీ చైర్మన్ ఎం బి కుమార్ రాజా. బంగారుపాళ్యం6. మనం న్యూస్ చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం కొదలమడుగు గ్రామపంచాయతీకి చెందిన సర్పంచ్ మాలతి ప్రతాప్ కుమారుడు జి.వెంకటేష్ ఎంబి.బిఎస్. ఎంఎస్,ఆకస్మిక మరణం మండలంలో ఎందరినో కలసివేసింది. అనుకోకుండా జరిగిన ఈ సంఘటన ఎంతో బాధాకరం. తమ కుమారుడి ఆకస్మిక మరణంతో శోకసంద్రం లో ఉన్న వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్ధిస్తూ మాజీ జెడ్పీ చైర్మన్, రాష్ట్ర పాలయకరి సంఘ అధ్యక్షులు ఎం.బి కుమార్ రాజా ,ఎంబి.హిమాకర్ రాజా ,మాజీ సింగల్ విండో చైర్మన్ దత్తాత్రేయ రెడ్డి, మొగిలి సర్పంచ్ మనోహరి చంద్ర శేఖర్ రెడ్డి ,బలిజపల్లి సర్పంచ్ కావలి శ్రీనివాసులు , జిల్లా మాజీ యువత ఉపాధ్యక్షులు కొత్తపల్లి మహేంద్ర పాల్గొని వారికి ఘన నివాళి అర్పించారు.

## తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు

# మాజీ ఎమ్మెల్యే మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు కన్నుమూత

**సీమ తెలుగుదేశం పార్టీలో తీవ్ర విషాదం**

**శోక సంద్రంలో కుటుంబ సభ్యులు**

**ప్రగాఢ సానుభూతి తెలిపిన రాష్ట్ర జిల్లా నాయకులతో పాటు పలువురు ప్రముఖులు**



రాయచోటి మే 06 మనం న్యూస్: నాలుగు దశాబ్దాల పైబడి రాజకీయ అనుభవం టిడిపి వ్యవస్థాపకులైన నాటి ఎన్టీఆర్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి వంటి నేతలతో మంచి అనుబంధం రాయలసీమ నాయకులలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిన వ్యక్తి సుగవాసి పాలకొండ్రాయిడి అకాల మరణం జిల్లా టిడిపి పార్టీకి తీరని లోటనే చెప్పుకోవాలి రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి అంటే పాలకొండ్రాయుడు పాలకొండ్రాయుడు అంటే టిడిపి లాంటి నేత గత కొద్ది కాలంగా తీవ్ర అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఆయన బెంగళూరులోనే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు ఆయన అకాల మరణంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు పాలకొండ్రాయిడి మరణ వార్త విన్న వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అచ్చం నాయుడు నారా లోకేష్ తో పాటు పలువురు ప్రముఖ నాయకులు తన కుమారుడైన సుగవాసి ప్రసాద్ బాబుకు చరవాణి ద్వారా తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు జిల్లాలోని టిడిపి నాయకులు కార్యకర్తలు స్నేహితులు అభిమానులు ఆయన మృతికి సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు రాయచోటి నియోజకవర్గం నుండి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి రాజంపేట పార్లమెంట్ నుండి ఎంపీగా గెలుపొంది అటు రాజకీయాలలో ఇటు ప్రజల మనసుల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని నిలుపుకొన్న గొప్ప మనసున్న నాయకుడు సుగవాసి పాలకొండరాయుడు అధికారం ఉన్నా లేకపోయినా తమని నమ్ముకున్న వారిని తాము నమ్మిన వారిని కాపాడుకుంటూ నేనున్నా అని భరోసాను కల్పిస్తూ పార్టీకి కంచుకోటగా నిలబడినటువంటి మహానేత ఇక మన మధ్య లేడు అన్నది ఎవరు నమ్మలేని నిజం ఇక సెలవు...

# ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వాసితుల ఛలో విజయవాడ

**7న సీసీఎల్ఏ కార్యాలయం ముందు నిర్వశిత రైతుల ధర్నా**



మదనపల్లి, మే 7,మనం న్యూస్: ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ 7న విజయవాడలోని సీసీఎల్ఏ కార్యాలయం ముందు జరుగు ధర్నా కు నిర్వశిత రైతులు బయలుదేరారు. మంగళవారం మదనపల్లి రోడ్డు నందు విజయవాడ కు వెళ్లే రైలులో బయలుదేరారు. ఈ సందర్బంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అన్నమయ్య జిల్లా, కురబలకోట మండలంలో ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించ తలపెట్టి బి.కొత్తోట మండలంలోని కోటవూరు గ్రామం, కురబలకోట మండలంలోని కురబలకోట, ముదివేడు, పిచ్చలవాండ్లపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో 765.1235 ఎకరాల భూమిని ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా, బలవంతంగా లాక్కున్నదని అన్నారు. దాదాపు 300 మంది రైతులు నిర్వాశితులు అయ్యారని, దిగువసీతివారిపల్లి, కొత్తపల్లి, చౌటకుంటపల్లి, దిన్నమీదపల్లి గ్రామాలు పూర్తిగా మునిగిపోతున్నా పునరావాసం గాని, నష్టపరిహారం గానీ చెల్లించలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిపిఎం ఆధ్వర్యంలో పోరాడిన ఫలితంగా 107.46 కోట్ల పాయలు నష్టపరిహారం చెల్లిస్తామని హామి ఇచ్చారని గుర్తు చేశారు. అనేక పోరాటం ఫలితంగా దాదాపు 300 మంది రైతులకు నష్టపరిహారం7 కోట్లు రావాల్సి ఉండగా కేవలం 22 మంది రైతులకు 1.65 కోట్ల నష్టపరిహారం కూటమి ప్రభుత్వం విడుదల చెయ్యడం దుర్మార్గం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని మిగిలిన రైతులకు నష్టపరిహారం చెల్లించడంతో పాటు, పునరావాసం కల్పించాలని, భూమి లేని వ్యవసాయ కూలీలకు 5లక్షల పరిహారం . చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వశిత రైతులు రాజేష్, శ్రీనివాసులు, గంగరాజు, రెడ్డెప్ప, లక్ష్మిదేవి, రమణమ్మ, గణేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# మన ప్రభుత్వం రైతు పక్షపాతి: ఎమ్మెల్యే పులివర్తి నాని

(మొదటి పేజీ తరువాయి)

మృతి చెందిన రమణ కుటుంబానికి నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఆ కుటుంబీకులు ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు తెలిపారు.

మినీ గోకులాలతో ఎమ్మెల్యే పులివర్తి నాని కి ప్రజల్లో పెరుగుతున్న విశేష ఆదరణ

రైతు కుటుంబాలకు ఆధారంగా ఉన్న పశువుల సంరక్షణ కోసం మినీ గోకులాలను అందించిన ఘనతతో ఎమ్మెల్యే పులివర్తి నాని పేరు ఘన చరిత్రగా ప్రజల్లో కీర్తిగడిస్తున్నది .రైతులుకోసం చేసిన నీ మేలులు మరువలేనివంటూ ఆయన చేసిన అమూల్యమైన సేవలకు ప్రజల్లో నుంచి అనూహ్యమైన స్పందనతో విశేషంగా ఆదరణ పొందుతుండడం విశేషం.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు గిద్దయ్య,అరుణ, తాసిల్దార్ పరమేశ్వర స్వామి,డిప్యూటీ తాసిల్దార్ వాసుదేవ కుమార్, కన్వీనర్ దేశిరెడ్డి రఘునాథ్, బెల్లంకొండ మురళి, మహిళా అధ్యక్షురాలులు చిట్టెమ్మ, లక్ష్మిదేవి, ముత్తం ప్రభాకర్,మహేష్ నాయుడు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిపి అగ్రహారం శ్రీ శ్రీగంగమ్మ ఆలయంలో అంబళ్లు.



శ్రీకాళహస్తి మే 6, మనం న్యూస్, పట్టణంలోని బీపీ అగ్రహారంలో గంగమ్మ జాతర చాటింపు ఈ సందర్భంగా గంగమ్మ మూలవిరాట్ కు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అంబళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు ఎమ్మెస్ రెడ్డి, మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణంలోని బీపీ అగ్రహారంలో ప్రతి సంవత్సరం జాతర ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా మంగళవారం రాత్రి గంగమ్మ అమ్మవారి చాటింపు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. 13, 14 తేదీలలో గంగమ్మ జాతర జరుగుతుందని, 13వ తేదీ పొన్నాలమ్మ అమ్మవారికి పొంగళ్ళు, రాత్రి అమ్మవారి కొలుపు,14వ తేదీ గంగమ్మ ఆలయం వద్ద అమ్మవారిని నిలుపు, రాత్రి నిమజ్జన కార్యక్రమం ఉంటుందన్నారు. గంగ జాతర సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా అమ్మవారికి సారే అందజేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. గంగ జాతరను మంగళ వాయిద్యాలు మేళతాళాల మధ్య ఘనంగా నిర్వహించడం జరుగుతుందని భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, కందపు శెట్టి, వెంకట ముని రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జేఏసీ వైస్ చైర్మెన్ గా తాళ్ళపాక దాము



తిరుపతి మే 5 మనం న్యూస్. : అఖిలభారత మాల కులస్తుల సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ గా తాళ్లపాక దాము ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని మల్లారపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లో అఖిల భారత మాల సంఘాల జేఏసీ కేంద్ర కార్యాలయంలో జేఏసీ చైర్మెన్ ఉప్పులేటి దేవి ప్రసాద్ మరియు కమిటీ సభ్యులు వైస్ చైర్మెన్ గా తాళ్ళపాక దాము (తిరుపతి)ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది...చైర్మెన్ ఉప్పులేటి దేవి ప్రసాద్ మాట్లాడుతూ దళితుల కు ఎక్కడ అన్యాయము జరిగిన ముందుండి పోరాడుతూ, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకొని వెళుతున్న తాళ్ళపాక దాము (తిరుపతి) దళితులు పట్ల అదే విధంగా సేవ చేస్తారని ఆశాభావం వక్తం చేశారు . ఈ సందర్భంగా వైస్ చైర్మెన్ తాళ్లపాక దాము మాట్లాడుతూ దళితుల సమస్య ల పట్ల చేస్తున్న సేవలను గుర్తించి నాపైన నమ్మకంతో ఈ బాధ్యత నాకు అప్పగించినందుకు నా జాతి వారసత్వానికి మరింత సేవలు చేసేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకాడనని పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు . ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవి ప్రసాద్ ను వైస్ చైర్మన్ తాళ్లపాక దాము దృశ్యాలువా కప్పి సన్మానించారు .ఈ కార్యక్రమములో మాల కులస్తుల జాయింట్ యాక్షన్ కమిటీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు

## రాయలచెరువు వైభవంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు



రామచంద్రాపురం: తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకొని మండలంలోని రాయలచెరువు గ్రామంలో గంగమ్మకు మేకల తిరుమలరెడ్డి, మాధవి రెడ్డి లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం గ్రామ దేవత అయిన గంగమ్మ ఆలయం వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించి బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అమ్మవారికి అంబలిని నైవేద్యంగా సమర్పించి కర్పూర హారతులిచ్చి మొక్కులు తెచ్చుకున్నారు. అమ్మవారి అంబలి ప్రసాదాన్ని గ్రామస్తులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో చేకూరి చంద్రకళ. నాగభూషణం, పట్నం రామయ్య, నాగరాజు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలు బహిరంగ వేలం



బంగారు పాల్యం తవణంపల్లి మే 6. మనం న్యూస్: చిత్తూరు జిల్లా, తవణంపల్లి పోలీస్ స్టేషన్ నందు వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన ఒక ఈచర్ లారీ,ఆరు మోటార్ సైకిల్ వాహనములను చిత్తూరు జిల్లా అసిస్టెంట్. ప్రోహిబిషన్ %డ% ఎక్సైజ్ సూపరింటెండెంట్, చిత్తూరు, ఎస్. కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో మే నెల 13 వతేదీ మంగళవారం తవణంపల్లి పోలీస్ స్టేషన్ నందు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్సై - ఏ. చిరంజీవి ఓ ప్రకటన లో తెలిపారు. కావున ఈవేలంలో పాల్గొన దలచిన వ్యక్తులు తవణంపల్లి పోలీస్ స్టేషన్ నందు అదే రోజు ఉదయం 10 గంటలకు సంభంది%శీ%చిన రుసుమును చెల్లించి వేలములో పాల్గొనాలని, ఇతర వివరాలకు తవణంపల్లి పోలీస్ స్టేషన్ నందు సంప్రదించాలని ఎస్సై చిరంజీవి కోరారు.

## ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌చే పారిశ్రామిక వాడ శంకుస్థాపన ను విజయవంతం చేయండి.

**టీడీపీ సీనియర్ నేత పులి సత్యనారాయణ రెడ్డి**




వాల్మీకిపురం మే 6 మనం న్యూస్: వాల్మీకిపురం మండలం గండబోయినపల్లి టోల్ గేట్ సమీపంలోని ఏపీఐఐసీ కి కేటాయించిన భూమిలో పరిశ్రమల ఏర్పాటు శంకుస్థాపన కు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి విచ్చేయనున్నారని టీడీపీ సీనియర్ నాయకులు, పులి సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. 8 వ తేదీ గురువారం ఉదయం 9:30 గంటలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. ఆయన రాక కొరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే తో పాటుగా మాజీ మార్కెట్ కమిటీ చెర్మన్ కంభం నిరంజన్ రెడ్డి మరియు జిల్లా స్థాయి అధికారులు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, నల్లారి అభిమానులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.